క్లుప్తంగా

పార్వతీపురంలో కిలో టమాటా రూ.50



రైతుబజాలరులో టమాటా కొనుగోలుకు క్యూలో నిల్చున్న కొనుగోలుదారులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం రైతు బజారులో కిలో టమాటా రూ.50కే విక్రయిస్తున్నట్టు ఎస్టేట్ ఆఫీసర్ సంజన బుధవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తక్కువ ధరకు టమాటా విక్రయిస్తున్నామన్నారు. వినియోగదారులు ఆధార్/రేషన్ కార్డును కౌంటర్ వద్ద చూపించి టమాటాను కొనుగోలు చేయాలని సూచించారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

పార్వతీపురంటౌన్: 11కెవీ బెలగాం ఫీడర్ ట్రీ కటింగ్ చేయడం నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ గోపాలరావు నాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పవర్ సప్లై ఉండదన్నారు. గూడ్స్‌షెడ్ రోడ్, సౌందర్య రోడ్డు శత్రుచర్ల రియల్ ఎస్టేట్ రోడ్డు, ఎస్ఎన్‌పీ కాలనీ, రిక్షా పుల్లర్స్ కాలనీ, జనశక్తి కాలనీ, వివేక్‌కాలనీ, చర్చి వీధి వైకేఎం కాలనీ, డీవీఎం స్కూల్, అగ్రహారం వీధి తదితర కాలనీలకి పవర్ సప్లైలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏకగ్రీవం



పాలకవర్గ సభ్యులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

మక్కువ: స్థానిక సచివాలయంలో శ్రీ పోలమాంబ స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గం సభ్యులుగా తాతపూడి.సత్యనారాయణ, బోరబంద.శివుడు, రౌతు సింహాచలం, దుగ్గాడ తిరుపతి, మామిడి.సూరన్న దొర, మరడాన రాము.అమరకంట జగన్నాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలకవర్గ సభ్యులకు ఎన్నికల అధికారి పి.రమాదేవి ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారు. కార్యక్రమంలో మత్స్యకారులు పాల్గొన్నారు.

పాచిపెంట ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓకు అభినందనలు తెలియజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది

పాచిపెంట: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బీవీజే పాత్రో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఆయనకు అభినందనలు తెలియజేశారు. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల మోత తగదు

పాలకొండ రూరల్: ఏపీలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల మోత మోగించేందుకు సిద్ధమవుతుందని అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీల పెంపు ఉండదని, నాణ్యమైన విద్యుత్ మరింత మెరుగ్గా అందిస్తామని చెప్పి కూటమి నేతలు ఇప్పుడు ఆ మాటలను మరిచారని విమర్శించారు.

మూడు నాటుబళ్లు.. ఆరు ట్రాక్టర్లు..!



నాటుబళ్లతో తరలిస్తున్న ఇసుక

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పుష్కలంగా అధికార పార్టీ అండదండలు
- ప్రభుత్వ కార్యాలయాల ముందు నుంచి ధైర్యంగా తరలింపు
- పట్టించుకోని అధికారులు



సాలూరు పట్టణ నడిబొడ్డులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్

సాలూరు రూరల్:

ప్రభుత్వం అమలు చేసిన ఉచిత ఇసుక విధానం తెలుగుతమ్ముళ్ల పాలిట వరంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంతవరకు ఒక ఎత్తు ఇకమీదట ఒక ఎత్తు అంటూ తెలుగు తమ్ముళ్లు మంత్రి అండతో ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగిస్తున్నారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో ఎక్కడ కూడా ఇసుక రీచ్‌లు అధికారికంగా ఇవ్వలేదు. అయితేనేం ఇసుక రవాణా మాత్రం ఇష్టానుసారం సాగుతోంది. సాలూరు మండలం శివరాంపురం, దుగ్ధసాగరం వట్టిగెడ్డనుంచి ఇసుక అక్రమంగా తరలిపోతోంది. అలాగే పాచిపెంట మండలం పాంచాలి, మోసూరు ప్రాంతంలో వట్టిగెడ్డ నుంచి పట్టపగలే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. అలాగే సాలూరు పట్టణానికి దగ్గరగా ఉన్న కొట్టక్కి వద్ద వట్టిగెడ్డలో రాత్రిపూట జేసీబీలతో ఇసుకు లోడింగ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాగే సాలూరు మండలంలోని మామిడిపల్లి గోముఖి నదిలో ఇసుకట్రాక్టర్లతో యథేచ్ఛగా తరలిస్తున్నారు. ముఖ్యంగా మోసూరు, దుగ్ధసాగరం గ్రామాలవద్ద నదిలో పెద్ద ఎత్తున ఇసుక తరలిపోతోంది. రెండురోజులుగా పాంచాలి, మోసూరు గ్రామాల నుంచి సాలూరు పట్టణ నడిబొడ్డున పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా నిర్మాణం జరుగుతున్న భవనానికి పట్టపగలే ఇసుక రవాణా చేస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లను చూసిన పట్టణ వాసులు ఇసుక రీచ్‌లు లేకుండా పట్టపగలు ఇలా అక్రమంగా తరలిస్తున్నారా? అని ముక్కున వేలేసుకుంటున్నారు. ఎంత పలుకుబడి ఉంటేకాని ఇంత ధైర్యంగా ఇసుక అక్రమంగా తరలించే పరిస్థితి ఉంటుందని చర్చించుకుంటున్నారు. మంత్రి ఇంటి ముందు నిర్మాణం జరుగుతున్న పార్టీ కార్యాలయానికి గతంలో ఇసుక తరలించారు. ఈ విషయంలో అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇదిలా ఉండగా సాలూరు ప్రాంతంలో ఇసుక రీచ్‌లు ఇచ్చేంత ఇసుక లేనందున కేవలం ఎద్దుల బళ్లకు మాత్రమే అనుమతులు ఉన్నాయి.నదిలో తక్కువ శాతం ఇసుక ఉన్నందున యంత్రాలతో ఇసుక తోడేస్తుంటే తమ బతుకులు ఏంకావాలని ఇసుక రవాణా కోసమే లక్షలు పెట్టి ఎద్దులు కొనుగోలు చేసి పొద్దున లేచి కష్టపడి కుటుంబాలను పోషించుకుంటున్నామని ఇలా ట్రాక్టర్లతో తరలిస్తే తమ ఉపాధి కోల్పోవాల్సి వస్తుందని ఇసుక పూర్తి అడుగంటితే తమ బతుకులు ఏంకావాలని నాటుబళ్ల యజమానులు వాపోతున్నారు.

మా దృష్టికి వస్తే చర్యలు

సాలూరు మండలం చుట్టు పక్కల ఎక్కడా ఇసుక రీచ్‌లు ఇవ్వలేదు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. నాటు బళ్లకు అనుమతులున్నాయి. అదికూడా ప్రభుత్వ భవన నిర్మాణాలు, పేదల ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే వినియోగించాలి. ట్రాక్టర్‌తో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా దొరికితే తొలిసారి రూ.25వేలు జరిమానా, రెండవసారి పట్టుపడితే రూ.50వేలు, మూడోసారి పట్టుపడితే పూర్తిగా సీజ్ చేస్తాం. కలెక్టర్ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– ఎన్వీ రమణ, తహసీల్దార్, సాలూరు

సమస్యలు పరిష్కరించాలి



డీఆర్‌ఓ కేశవ నాయుడికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, గ్రీన్ అంబాసిడర్‌లు

పార్వతీపురం: ఏడాది కాలంగా గ్రీన్ అంబాసిడర్‌లకు వేతనాలు సక్రమంగా చెల్లించడంలేదని, ఈ కారణంగా వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, తక్షణం వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు, గ్రీన్ అంబాసిడర్‌లు జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించిన పిమ్మట వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వై.మన్మథరావు, జి.వెంకటరమణలు మాట్లాడుతూ గతంలో స్వచ్ఛ ఆంధ్రమిషన్ ద్వారా వేతనాలు చెల్లించేవారని, తరువాత పంచాయతీల ద్వారా వేతనాలను చెల్లిస్తున్నారన్నారు. పంచాయతీల నుంచి వేతనాలు చెల్లించినప్పటి నుంచి నిధుల లేమి కారణంగా గ్రీన్ అంబాసిడర్‌లకు సక్రమంగా వేతనాలు అందడంలేదన్నారు. నిత్యం పారిశుధ్య పనులను చేపట్టి కాలం వెళ్లబుచ్చుతున్నా వారికి పని ప్రదేశంలో సరైన రక్షణలేక, ఇన్సూరెన్సు సదుపాయంలేక, పని భద్రతలేకపోవడంతో పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని డీఆర్‌ఓ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్‌లతోపాటు నాయకులు నల్లయ్య, నూకయ్య తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీడీపై దర్యాప్తు చేపట్టాలి



ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవకు వినతిపత్రం అందజేస్తున్న కొల్లి సాంబమూర్తి

పార్వతీపురంటౌన్: వెలుగు ఏపీడీపై దర్యాప్తు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్‌చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీడీఏలో గత కొన్ని సంవత్సరాలుగా నిధులు నిర్వహిస్తున్న వెలుగు ఏపీడీ వై.సత్యం నాయుడు పనిచేసిన కాలంలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులపైన వివిధ మండలాల కార్యాలయాల నిర్వహణ కోసం కొన్నమిషనరీ పైన ఇతర సామగ్రి పైన లావాదేవీల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని కోరారు. ఐటీడీఏ పరిధిలో 58 వన్‌ధన్ కేంద్రాలు నిర్వహించడంలో ఆయన ఇష్టానుసారం వ్యవహరించడంతో ఎక్కువగా అటవీ ఉత్పత్తులను గిరిజన మహిళలు ప్రాసెసింగ్ చేసుకోవడానికి వీల్లేకుండా తీవ్రనష్టం జరిగిందన్నారు. దీనివల్ల గిరిజన మహిళలు ఆర్థికంగా చాలా ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి కమీషన్ అకౌంట్‌కు వచ్చే ఆర్థిక లావాదేవీలను మహిళా సంఘాలకు చెల్లించకుండా ఆయన వాడుకున్నట్లు తెలిసిందన్నారు. వీటిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని కోరారు.

ఘనంగా సప్త ప్రాకార సేవ



పోలమాంబ ఉత్సవ విగ్రహం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మక్కువ: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో ఈఓ వీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సప్త ప్రాకార సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు పోలమాంబ అమ్మవారి ఉత్సవ మూర్తిని చదురు గుడి నుంచి ఊరేగింపుగా వేద మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాహలం మధ్య పలురకాల పిండివంటలతో ఊరేగింపుగా బుధవారం వనంగుడి వద్దకు తీసుకువెళ్లారు. అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి నైవేద్యంగా ప్రసాదాన్ని చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల.పోలినాయుడు, ఉపసర్పంచ్ అల్లు వెంకటరమణ, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రత్నకుమారి

భామిని: సేంద్రియ వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని, నేలతల్లికి కూడా మేలు జరుగుతుందని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి అన్నారు. భామిని, బొడ్డగూడ గ్రామాల్లో ఎంఏఓ కె.సింహాచలం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. ఈ సాగు పద్ధతిలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. ముందుగా బొడ్డగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేంద్రీయ వ్యవసాయ పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. వ్యవసాయ సహాయకుడు ఎర్రన్న, ఫిషరీస్ సహాయకుడు ఆదినారాయణ, గిరిజన రైతులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



అడారు గ్రామంలో విచారణ చేస్తున్న డీఎస్పీ రాంబాబు

వీరఘట్టం: మండలంలోని అడారు గ్రామానికి చెందిన ఎస్.యోగిన్నదొరను అదే గ్రామానికి చెందిన ఎం.హరి, భాను ఈ నెల 5న కులం పేరుతో దూషించి, కర్రతో దాడి చేసి తలపై గాయం చేశారని వచ్చిన ఫిర్యాదుపై ఈ నెల 6న అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు. ఈ కేసును విచారించేందుకు పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు అడారు గ్రామానికి బుధవారం వెళ్లారు. బాధితుని నుంచి, సాక్షుల నుంచి కేసుకు సంబంధించి వివరాలు సేకరించారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు తప్పనిసరి



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.నారాయణ

- డీఐఓ డాక్టర్ ఎం.నారాయణ

పార్వతీపురంటౌన్: చిన్నారులకు సకాలంలో టీకాలు తప్పనిసరని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.నారాయణ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 15వ వార్డులో వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. షెడ్యూల్ ప్రకారం టీకాకు అర్హులైన పిల్లలు, గర్భిణుల వివరాలు, గడువు తేదీలను, టీకా కార్డుల్లో పరిశీలించారు. వ్యాక్సిన్ కాల పరిమితి తనిఖీ చేశారు. ఐదేళ్ల లోపు పిల్లలకు సకాలంలో టీకా వేశారా? అని, ఎవరైనా డ్రాపౌట్స్/లెఫ్ట్ ఔట్స్ ఉంటే గుర్తించి టీకా పూర్తి చేయాలని సూచించారు. టీకాలు వేయడం పూర్తయిన వెంటనే కార్డులో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల బరువు, ఎదుగుదల నమోదు రికార్డులు పరిశీలించారు. పిల్లలు పౌష్టికాహారం సరిగా తీసుకునేలా చూడాలని సూచించారు. పిల్లల్లో శ్వాస సంబంధమైన సమస్యలు, జ్వరం, తదితర వ్యాధులు గుర్తిస్తే వెంటనే తగిన చికిత్స అందజేసి పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, ఏఎన్ఎం నారాయణమ్మ, అంగన్వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సరస్వతీ దేవిగా దుర్గమ్మ



సరస్వతీ దేవి అవతారంలో కొత్తవలస దుర్గమ్మ



వేమకోటివారి వీధిలో సరస్వతీ దేవి అవతారంలో అమ్మవారు



మరిపవలసలో మహిళల సామూహిక కుంకుమ పూజ

పార్వతీపురంటౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పార్వతీపురం పట్టణంలోని కొత్తవలస, సీతానగరం మండలంలోని మరిపవలస దుర్గాలయంలో అమ్మవారు బుధవారం సరస్వతీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరారు. వైకేఎం కాలనీలోని దుర్గాలయంలో అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

నర్సిపురంలో దీపాలతో అలంకరణ

పార్వతీపురం మండలం నర్సిపురం పెద్దవీధిలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మంటపంలో శరన్నవరాత్రుల సందర్భంగా బుధవారం రాత్రి ప్రమిదల్లో ఓం, స్వస్తిక్ ఆకారాల్లో మహిళలు దీపాలు వెలిగించారు. అనంతరం అమ్మవారి సన్నిధి వద్ద భక్తి శ్రద్ధలతో ప్రత్యేకపూజలు చేసి చిన్నారులు, మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక పారాయణలు ఆలపించారు.



ప్రమిదల్లో దీపాలు

వరికి మూషికాలతో ముప్పు

- పంటలను దెబ్బతీస్తున్న ఎలుకల గుంపులు
- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- సామూహిక నివారణ చర్యలతో ప్రయోజనం



పొట్ట దశలో ఎలుకల బారిన పడుతున్న వరి పంట

పాలకొండ రూరల్: అన్నదాత ఆరుగాలం కష్టించి పండిస్తున్న పంటలపై మూషికాలు దాడి చేస్తూ ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ వరి పంట పొట్ట దశకు చేరుకుంటున్న తరుణంలో తీపిగా ఉండే దుబ్బు, పిలకలను ఎలుకలు తినేస్తుండటంతో దిగుబడిపై ప్రభావం పడుతుంది. మూషికాల బారి నుంచి వరి పైరును ఎలా సంరక్షించుకోవాలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు కె.రత్నకుమారి వివరించారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో లక్షా70 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. వర్షాభావ పరిస్థితి కారణంగా ఆగస్టు చివరి నాటికి ఊడుపులు పూర్తయ్యాయి. చాలా చోట్ల వెదజల్లు పద్ధతి అవలంభించడంతో అవి వేగంగా పెరిగి దుబ్బు కట్టే దశకు చేరుకున్నాయి. పిలకలు పొట్ట తీపిగా ఉండడంతో ఎలుకలు వాటిని కొరికి బొరియల్లోకి తీసుకెళ్తున్నాయి. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో నివారణపై దృష్టిపెట్టాల్సి ఉంటుంది.

నివారణకు ఏం చేయాలంటే..

గ్రామంలోని రైతులంతా సామూహిక ఎలుకల నివారణకు చర్యలు చేపట్టాలి. సామూహిక ఎలుకల నివారణకు బ్రోమోడయాలిన్ రెండు శాతం మందును ఉపయోగించి సత్ఫలితాలను పొందవచ్చు. బ్రోమోడయాలిన్ 0.25 మిల్లీలీటర్ల ఎలుకల మందు రెండు శాతం విషపు ఎరగా తయారీ చేసుకోవడం కోసం 96 శాతం నూకలు, రెండు గ్రాముల నూనె, రెండు గ్రాముల బ్రోమోడయోలిన్ మందును కలపాలి. ఒక్కో ఎలుక బొరియకు 10 గ్రాముల ఎరను కాగితంలో పొట్లంగా చుట్టి బొరియల్లో అంగుళం లోపల పెట్టాలి. పొట్లాలు అమర్చిన అనంతరం బొరియను మూసి వేయకూడదు. భారీ, మోస్తరు వర్షం గానీ వస్తే వర్షం ఆగే వరకూ చూడాలి. లేదంటే మరుసటి రోజుకు వాయిదా వేయాలి. ఎర మందు వర్షంలో తడిస్తే సరిగా పని చేయదు. కలిపిన ఎర మందు 12 గంటలు దాటితే ఆ వాసనను ఎలుకలు పసిగడతాయి. కాబట్టి ఈ విశ్రమాన్ని మధ్యాహ్నం కలిపి సాయంత్రంలోపు అమర్చాలి. ఎలుకలు నిశాచరులు కాబట్టి సాయంత్రం నుంచి మరుసటి రోజు ఉదయం వరకూ స్వీకరించే అవకాశం ఉంది. మందు తిన్న నాలుగు నుంచి ఐదు రోజుల్లో ఎలుక చనిపోతుంది.

పొగ పెట్టాలి

పొగబారించే యంత్రం (బర్రోఫ్యూమి గేటర్)తో ఎలుక బొరియలను కప్పి రెండు నుంచి మూడు నిమిషాలు పొగ పెడితే వాటిలో ఉంటే తల్లి, పిల్ల ఎలుకలు పూర్తిగా చనిపోతాయి. తొలకరి చినుకుల అనంతరం పంట భూమిని దుక్కి చేయాలి. రైతులు పొలం గట్లపై కాకుండా పోరంబోకు భూములు, ఖాళీ ప్రదేశాల్లో విషపు ఎరను పెట్టి ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలి. ఎలుక బొరియలను ఎప్పటికప్పుడు గమనిస్తూ పొగ పెట్టడం మంచిది.

నివారణే సరైన మార్గం



వరి పంట కీలక దశలో ఎలుకల కారణంగా తీవ్ర నష్టం జరుగుతోంది. రైతులు దీనిపై దృష్టి సారించి సామూహికంగా ఎలుకలను నిర్మూలించేలా చర్యలు చేపట్టాలి. ఇందుకు ఎన్నో పద్ధతులు ఉన్నాయి. వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు చర్యలు తీసుకోవాలి.

– కె.రత్నకుమారి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, పాలకొండ

కూరగాయల సాగుపై రైతుల ఆసక్తి

కొమరాడ: కూరగాయ పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధర లభిస్తుండంతో కూరగాయల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మెట్టు, పల్లం భూములనే తేడాలేకుండా నీరు అందుబాటులో ఉన్నచోట్ల సేంద్రియ ఎరువులు వినియోగించి పంటలు సాగుచేస్తున్నారు. మండలంలోని కొమరాడ, కళ్లికోట, దుగ్గి, గుణానపురం, గంగారేగువలస, కుమ్మరిగుంట, కందివలస, దళాయపేట, తొడుమ స్వామినాయుడువలస, కోదలగుంప తదితర గ్రామాల్లో వంగ, మిరప, చిక్కుడు, కాకర, టమోటో బీర, బెండ, తదితర కూరగాయ పంటలు, ఆకు కూర పంటలు సాగుచేస్తున్నారు. టెల్లీస్ విధానంలో టమోటాలు, పందిళ్లపై పాదుజాతి కూరగాయలను సాగుచేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. మండలంలో సుమారు వెయ్యి ఎకరాల్లో కూరగాయ పంటలు సాగులో ఉన్నాయి. మెట్టు ప్రాంతాలు, వరి పంట పొల్లాల గట్లుపై కూడా కూరగాయలు సాగుచేస్తూ రైతులు అదనపు ఆదాయం ఆర్జిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కూరగాయల ధరలు బాగుండటంతో అధిక ఆదాయం వస్తోందని రైతులు అంటున్నారు. కళ్లికోట, కుమ్మరిగుంట కూరగాయలకు పార్వతీపురం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.